కథ

# మెడ తెలుగు

వెంకటరెడ్డి గంటా
93980 73757

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

సద్దికూడు దినే యాలైపోయాక..
''బరిగొడ్లను యిప్పండమ్మో!'' అని దేవలం దగ్గిర గొడ్లుగాసే కొండన్న గెట్టిగా అరిసి.. జంగిటి దిక్కు సాగిపాయ.
ముసిలి బర్రెను దప్ప, మిగిల్నోటిని ఇప్పి జంగిటికి తోలింది మాయమ్మ.
జంగిటెనుములు సాగి మాఊరి వంకదాటి పొయినాక.. గొడ్లమ్మిడి పోలేని ముసిలెనుముకు సట్లో మిగిల్నె సద్ది బువ్వ కడుగునీళ్లలో బోసి ముందర బెట్టింది. అది సద్ది బువ్వనూ, మాయమ్మనూ మార్సి మార్సి సూచ్చా.. పండ్లూడిపోయిన నోటితో నిదానంగా తింటాంది.
'ముసిలి ముప్పున నాకింత బువ్వబెట్టే మాతల్లివమ్మా నువ్వ'.. అన్నెట్టుంటాయి ముసిలిబర్రె సూపులు.
'నువ్వ జేసిన మేలు నేను బతికినన్నాళ్లు మర్శిపోతానా!?' అన్నెట్టుంటాయి మాయమ్మ సూపులు.
దాని వీపూ, మోరా నిమిరి మెడ తలుగు ఇప్పింది మాయమ్మ.
అది సిన్నంగా వంకదిట్టు పోతాంది మేసిరాడానికి. దానికి ఊర్లో దూడలు పదికి పైనే జతవుతాయి. అప్పుడు ఆ దూళ్ల గుంపునకు ముసిలిబర్రె పెద్దదిక్కు మాదిరి కనబడతాది.. అచ్చం మా నారవ్వ మాదిరే!
ఇరుగు పొరుగు ఆడంగులు సేలల్లో పనికో, గెడ్డికో పోతా.. సిన్నపిల్లోళ్లను నారవ్వ దగ్గిర ఇడిసిపెడతారు. పిల్లోళ్లు బావులదిట్టు, వంకదిట్టు పోకుండా కనిపెట్టుకోమని బతిమాలి ఎలబారతారు.
ఏడిసి అమ్మల ఎనకబడే పిల్లోళ్లను..
''నేనుండ్లే! మంచి కథలు సెప్తా రాండి'' అని బుజ్జగిచ్చి..
''బెన్నే తిరుక్కోండిమ్మేయ్! పిల్లోళ్లు ఎగజూచ్చాంటరు'' అని ఎనకనుండి అరిసి సెప్పుద్ది నారవ్వ.
వాళ్లొచ్చిన దనకా పిల్లోళ్లను కంటికి రెప్పలా కనిపెట్టుకోనుంటాదామె.
అదేమాదిరి ఎనకమ్మటి ఉండే దూడలకు..
'మీరు పైరుచేలల్లోబడి తింటే రైతులు కొడతారు. వంక ఊబిలో దిగితే పానాలు పోతాయ్. వొంటిగా కోళ్లను దెంకపోయ్యే కుక్కలకు సిక్కొద్దు.. భద్రం' అని ముసిలెనుము జాగర్తలు సెప్పుద్దనుకుంటా. మనకు తెలీకుంటే మటుకు వాటిమాటలు వాటికుంటాయి గదా!

* * *

యాడన్నా గొడ్డు సస్తే రాబందులకు ఈకెబెరికినట్టు.. ఎత్తుబడిన గొడ్లు, ముసిలి బర్రెల గురించి కటికెమనిషికి ఇట్నే పోబడి తెలిసిపోద్ది. మెడలో సత్తుకంటె, ముక్కుకు బులాకి, ఆముదం బూసి ఎనిక్కి దువ్విన తెలుపూనలుపూ కలగలిసిన జుట్టూ, లుంగీమీద జుబ్బా తొడిగి, ఎర్రగా వక్కాకు నవిలిన నోటితో.. టీవీయస్ బండిమీద తిరుగుతా ఆయప్ప మాఊర్లలో కటికగొడ్ల యాపారం జేస్తా ఉంటాడు.
ఆరోజు ఆయప్ప మా ఇంటికొచ్చి..
''మీ ఇంట్లో ముసిలి బర్రె ఉందంట గదా! ఇచ్చారా!?'' అని ముసిలెనుమును కోతకు అడిగిండు.
మాయమ్మకు కోపమొచ్చింది.
''మేము గొడ్డును కటెక్కు ఇచ్చామని యెవురన్నా మీకు సెప్పింది. పోయ్ రాపో!'' అనింది కటువుగానే.
''ఆఁ ఇంగ అది మీకు జేసే ఆదాయమేముంది?'' అన్నేడు ఆయప్ప మామూలుగానే.
మా ముసిలెనుము కట్టుపాయపు పడ్డగా ఉన్నెప్పుడు.. మాయవ్వ కోడండ్లతో సతపోరి మాయమ్మకు తోలి పంపి, మట్టిలో కలిసిపోయింది. అందుకేనేమో.. అదంటే ఆమెకు పానం.
నేను రంగంలోకి దిగి నాలుగు ముతక మాటలనేసరికి..
''ఎందుకులేబ్బా అంతకోపం'' అంటా కటికె యాపారం మనిషి యలబారిపాయ.
ఒకరోజు పొద్దు తిరుగుడు చేనికి మడవకట్టి ఇంటికొచ్చి, పెద్దపార కోళ్లగూటి బండమీద పెట్టబోతా ఉండగా..
''ఓ నాయినా! మూలీధికి బొయ్యి ఈర్రాఘువ మామను తొడకరాపో! ముసిలి బర్రెకు కాలిరిగింది, కట్టుగట్టియ్యాల'' అని ఎనుముల కొట్టంలోనుండి మాయమ్మ గెట్టిగా కేకబేసింది.
మాయమ్మ గొంతును బట్టి అర్థమయ్యింది.. అది పెద్దదెబ్బేనని.
పొయ్యి సూజ్జును గదా! దెబ్బతగిలిన వూపున ఎట్నో ఇంటికొచ్చి పడిపోయింది. ముందరికాలు వట్టికాలి పైన మోకాలుదెగ్గిర విరిగిపోయి వేలాడుతా ఉంది. అది మాదిక్కు దీనంగా చూస్తా ఉంటే.. గుండెల మీద ఎవురో సమ్మెటతో మోదినట్టు బాధగా ఉంది.
పరుగుపరుగున వీర్రాఘువ మామోళ్ల ఇంటికాడికి పోయినా. అప్పుడే ఆ మామ కాడి ఇప్పి ఎద్దులను గాటిమీద కట్టేస్తా ఉండాడు. ఆ మామకు పశువుల వైద్దెము తెలుసు.
''మామా మామా! మా ముసలి ఎనుముకు కాలిరిగింది. కట్టు కట్టాల మామా'' అని బతిమలాడినా.
ఆ పక్కనే ఉన్న మా అత్త వక్కాకు బొక్కలాడుతా..
''ఓయబ్బ! ఊరూ, మాలాడకు ఈ డాకటేరే దొరికిండబ్బా!'' అని చెనికింది.
''మెట్టుతో నోటిమింద కొడ్తా.. అడ్డకూతలు కూచ్చే! అవతల మనిషి ఇబ్బంది పడి వాకిలి దొక్కి అడుగుతాంటే, ఇట్నేనా మాట్లాడేది?'' అని మాయత్తను గదిరిచ్చి..
''నువ్వింటికి బొయ్యి కట్టుకు గుడ్డలు, రెండు కోడిగుడ్లు జూసిపెట్టు దొరా! నేను పసురాకు, ఎదురు దబ్బలూ దీసుకోనొచ్చా'' అని వీర్రాఘువ మామ సెప్పగానే.. పానం నిమ్మలబడి, ఇంటికొచ్చి ఆయప్ప సెప్పినోటియి సిద్ధం జేసేలోపల ధర్మాత్ముడు, మద్దినాల సంగటి గూడా తినకుండా సెప్పినట్టే వచ్చిండు.



